ప్రభాత తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
26-09-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 24 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీ గెలిస్తే.. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతుందని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారని హెచ్చరించారు ప్రధాని నరేంద్ర మోడీ.

# హర్యానాకు మోడీ హెచ్చరిక

**అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హర్యానాలో బీజేపీ తరపున ప్రచార సభల్లో పాల్గొన్నారు ప్రధాని మోడీ. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించారు. హర్యానా రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని ప్రధాని మోడీ చెప్పారు. కాంగ్రెస్ ఆశలు సన్నగిల్లుతున్నాయన్నారు.**

**జయభేరి, ఛండీగఢ్:**

కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా.. బంధుప్రీతి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలోనే ప్రభుత్వ వ్యవస్థలో భారీగా అవినీతి జరిగిందని ధ్వజమెత్తారు. హర్యానాను వారి వారసులకు, మధ్యవర్తులకు అప్పగించిందన్నారు. హర్యానా రాష్ట్రం బీజేపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు మోడీ. వ్యవసాయ, పరిశ్రమల రంగాల్లో దేశం అగ్రస్థానంలో ఉందని ప్రధాని చెప్పారు. పారిశ్రామిక వృద్ధితోనే దళితుల సాధికారత ముడిపడి ఉందని అంబేద్కర్ పేర్కొన్నారని మోడీ గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో ఓ బాలుడు తాను గీసిన మోడీ చిత్రాన్ని చూపుతుండటం ఆయన గమనించారు. తన చిరునామా రాసి, ఆ చిత్రాన్ని భద్రతా సిబ్బందికి అందించాలని బాలుడిని ప్రధాని కోరారు. తాను ఆ బాలుడికి లేఖ రాస్తానని చెప్పారు. సోనిపట్, రోహ్‌తక్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 18 అసెంబ్లీ నియోజకవర్గాలు, పానిపట్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో కవర్ చేశారు. సెప్టెంబర్ 15న కురుక్షేత్రలో ప్రధాని మోడీ తన మొదటి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వరుసగా మూడోసారి అధికారాన్ని నిలుపుకునేందుకు మోడీతోపాటు జాతీయ నేతలు, రాష్ట్ర నేతలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. జమ్మూకాశ్మీర్ తోపాటు అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# దసరా కానుక

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లు వెంటనే లబ్దిదారులకు అప్పగించండి... రాజీవ్ స్వగృహ ఇళ్లు వేలం

## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



2 లో

దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



2 లో

# ముడా కుంభకోణంపై లోకాయుక్త విచారణ

## సిద్ధమేనంటున్న సిద్ధరామయ్య

**జయభేరి, కర్నాటక:**

ముడా స్థల కేటాయింపు కుంభకోణానికి సంబంధించి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై లోకాయుక్త విచారణకు కర్ణాటక ప్రత్యేక కోర్టు ఆదేశించింది. తానేం తప్పు చేయలేదని, లోకాయుక్త విచారణకు సిద్ధంగా ఉన్నానని సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. మైసూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (MUDA) స్థల కేటాయింపు వివాదంలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పై లోకాయుక్త విచారణకు కర్ణాటక ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ కుంభకోణం లో తనపై ప్రాసిక్యూషన్ కు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ సిద్ధ రామయ్య దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో.. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ బుధవారం లోకాయుక్త విచారణకు ఆదేశించారు. అయితే, ముడా కేసులో విచారణను ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, దానికి భయపడబోనని కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య స్పష్టం చేశారు. అవినీతి నిరోధక ...మిగతాది 2 లో

# కార్మికుల వేతనాలు పెంచుతూ కొత్త సీఎం ఆతిశీ కీలక నిర్ణయం

**జయభేరి, న్యూఢిల్లీ:**





ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆమ్ ఆద్మీ కీలక నేత ఆతిశీ.. కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో అసంఘటిత రంగంలోని కార్మికుల కనీస వేతనాన్ని పెంచింది ఆప్ సర్కారు. అక్టోబర్ 1 నుంచి కొత్త రేట్లు అమలులోకి వస్తాయని సీఎం ఆతిశీ తెలిపారు. ఢిల్లీ సర్కారు తాజా నిర్ణయంతో నైపుణ్యం లేని కార్మికులకు కనీస వేతనం రూ. 18,066, మధ్యస్థ నైపుణ్యం కలిగిన వారికి రూ. 19,929, నైపుణ్యం కలిగినవారికి రూ. 21,917కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సామాన్య ప్రజలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకు అవసరమైన ప్రతి చర్యనూ ప్రభుత్వం చేపడుతుందని సీఎం ఆతిశీ ప్రకటించారు. ఇది ఇలావుండగా, కొత్త సీఎం ఆతిశీకి ఢిల్లీ పోలీసులు జడ్ కేటగిరీ భద్రత కల్పించారు. ఆమె కాన్వాయ్‌లో పైలట్ తో సహా పోలీసు సిబ్బందితో భద్రత కల్పించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రోటోకాల్ ప్రకారం.. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఢిల్లీ సీఎంకు జెడ్ కేటగిరీ వర్తిస్తుంది. దీంతో ఆతిశీకి రక్షణగా ఢిల్లీ పోలీసులు

# జపాన్‌ను వెనక్కి నెట్టిన దేశంగా భారత్



తైవాన్ నుంచి లడఖ్ వరకు కొనసాగుతున్న ఉద్రిక్తత మధ్య ఆసియాలోని అత్యంత శక్తివంతమైన దేశాల జాబితా వచ్చింది. రష్యా, జపాన్‌లను వెనక్కి నెట్టి ఆసియాలో మూడో అత్యంత శక్తివంతమైన దేశంగా భారత్ అవతరించింది. ఈ జాబితాలో భారత్ కంటే చైనా ముందుండగా, అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఆస్ట్రేలియాకు చెందిన లోవీ ఇన్‌స్టిట్యూట్ థింక్ ట్యాంక్ విడుదల చేసిన ఆసియా పవర్ ఇండెక్స్‌లో భారత్ మంచి జంప్ చేసింది. 2018లో ఆస్ట్రేలియా లోవీ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించిన ఆసియా పవర్ ఇండెక్స్ అనేది ఆసియాపసిఫిక్ ప్రాంతంలో పవర్ డైనమిక్స్ యొక్క వార్షిక కొలత. ఈ ఆసియా సూపర్ పవర్ ఇండెక్స్ జాబితాలో అమెరికా మొదటి స్థానంలో, చైనా రెండో స్థానంలో నిలిచాయి
రక్షణ నెట్‌వర్క్‌లు, ఆర్థిక సామర్థ్యం, సంబంధాలు, దౌత్య, సాంస్కృతిక ప్రభావం, స్థితిస్థాపకత, భవిష్యత్తు వనరులతో సహా ఎనిమిది పారామితులపై ...మిగతాది 2 లో



# దూసుకెళ్తోన్న కమలాహారిస్

## తాజా సర్వేలో ఎన్ని ఓట్లు వచ్చాయంటే..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో కమలాహారిస్ దూసుకెళ్లిపోతున్నారు. తాజా సర్వేలో ఆమె ముందంజలో ఉన్నారు. డెమొక్రాట్ అభ్యర్థిగా కమలాహారిస్.. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ బరిలో ఉన్నారు. నవంబర్‌లోనే అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అయితే తాజాగా జరిగిన సర్వేలో ట్రంప్‌ను కమల వెనక్కి నెట్టినట్లు రాయిటర్స్ఇప్సోస్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 3 రోజుల పాటు నిర్వహించిన సర్వే సెప్టెంబర్23తో ముగిసింది. ఈ సర్వేలో ట్రంప్‌నకు 40.48శాతం అనుకూలంగా ఓట్లు రాగా.. కమలకు 46.61 శాతం అనుకూల ఓట్లు వచ్చాయి. సెప్టెంబర్ తొలి వారంలో నిర్వహించిన సర్వేతో పోలిస్తే కమల ఒక శాతం ఎక్కువ ఓట్లు సాధించింది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికల తుదిపోరు జరగనుంది. తొలుత ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ రంగంలోకి దిగారు. ఆరోగ్య రీత్యా దేహం సహకరించకపోవడంతో ఆయన స్థానంలో కమలా హారిస్‌ను డెమోక్రాట్ పార్టీ రంగంలోకి దింపింది. ఈమెతో మాజీ అధ్యక్షుడు ట్రంప్ పోటీ పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈసారి ఓడిపోతే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ హత్యాయత్నం జరిగింది. దీంతో ఆయనపై సానుభూతి పెరిగింది. ఇద్దరిలో ఎవరు గెలుస్తారో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

▸▸ మొదటిపేజీ తరువాయి

## దసరా కానుక

దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం సూచించారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా... అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు కలిశారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి విధానాలపై ముఖ్యమంత్రితో కమిషన్ సభ్యులు చర్చించారు. బీసీ కులగణన ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలన్నారు. వెంటనే బీసీ కులగణనకు కార్యాచరణ ప్రారంభించి.. వేగంగా ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించరు. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## కొత్త సీఎం ఆతిశీ కీలక నిర్ణయం

22 మందిని షిఫ్టుల వారీగా మోహరించనున్నారు. జెడ్ కేటగిరీ భద్రతలో పీఎస్ఓలు, ఎస్కార్ట్స్, సాయుధ గార్డులు ఉంటారు. కాగా, ఎప్పటికప్పుడు ముప్పును అంచనా వేసి కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు కేంద్ర సంస్థలు ఆమె భద్రతను సమీక్షించే అవకాశం ఉంటుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టై ఇటీవల విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీలో కీలక నేతగా ఉన్న ఆతిశీని ముఖ్యమంత్రిగా ఉండాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆతిశీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆమెతోపాటు పలువురు మంత్రులుగా ప్రమాణం చేశారు. సీఎం కార్యాలయంలో ఒక కుర్చీని ఖాళీగా ఉంచి.. దాని పక్కనే మరో కుర్చీని ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు సీఎం ఆతిశీ. అరవింద్ కేజ్రీవాల్ కోసం ఆ కుర్చీని ఖాళీగా ఉంచడం గమనార్హం. తాను రామాయణంలో భరతుడి పాత్ర పోషిస్తున్నట్లుగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

## జపాన్‌ను వెనక్కి నెట్టిన భారత్

ఆసియాపసిఫిక్‌లోని 27 దేశాలను అంచనా వేస్తుంది. ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ ఇక్కడ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో.. నివేదిక ప్రస్తుత ఎడిషన్ ఈ ప్రాంతంలో విద్యుత్ పంపిణీకి సంబంధించిన అత్యంత సమగ్రమైన అంచనాలను అందిస్తుంది. జపాన్ ఆర్థిక బలం క్షీణించడం వల్లే దాని బలం తగ్గిందని చెబుతోంది. జపాన్ ఇప్పుడు నాల్గవ అత్యంత శక్తివంతమైన, ప్రభావవంతమైన ఆసియా దేశంగా మారింది. ఈ దేశాల వనరులు, ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం ఈ జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాలో ఆస్ట్రేలియాకు ఐదో స్థానం, ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకున్న రష్యాకు ఆరో స్థానం లభించాయి.

**పసిడి ధరలు భగభగ.. రూ.77 వేలు దాటిన బంగారం ధర.. హైదరాబాద్‌లో లక్ష దాటిన వెండి!**

అమెరికాకు 81.7 పాయింట్లు, చైనాకు 72.7 పాయింట్లు, జపాన్‌కు 38.9 పాయింట్లు వచ్చాయి. పాకిస్థాన్ 14.6 పాయింట్లు మాత్రమే సాధించి 16వ స్థానంలో ఉంది. ఆసియా పవర్ ఇండెక్స్‌లో మొత్తం 27 దేశాలు, భూభాగాలు అంచనా వేసింది. ఇందులో పాకిస్థాన్ నుంచి రష్యా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పసిఫిక్ ప్రాంతంలోని అమెరికాలను కూడా ఇందులో చేర్చారు. ఇందులో 6 సంవత్సరాల డేటా ఉపయోగించారు. ఇది ఆసియాలో వేగంగా మారుతున్న అధికార పంపిణీకి సంబంధించిన అత్యంత సమగ్రమైన అంచనా. అమెరికా ఇప్పటికీ ఆసియాలో అత్యంత ప్రభావవంతమైన శక్తి అని, అయితే ఇప్పుడు అది చైనా వేగంగా అభివృద్ధి చెందుతున్న సైన్యం నుండి ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ దేశాల ఆర్థిక, రక్షణ, దౌత్యం, ఇతర బలాల ఆధారంగా అంచనా వేశారు. చైనా ఖచ్చితంగా సైనిక ప్రయోజనాన్ని సాధించిందని, అయితే దాని మొత్తం ప్రభావం స్థిరంగా ఉందని ఈ నివేదికలో వెల్లడైంది. చైనా సత్తా పెరగడం లేదు.. తగ్గడం లేదని తేలింది. అదే సమయంలో ఆసియాలో అమెరికా తన సైనిక బలాన్ని పెంచుకుంది. అయితే సైనిక బలగంలో చైనా కంటే వెనుకబడడం అమెరికాకు ఆందోళన కలిగించే అంశం. ఈ సర్వే నివేదికలో భారత్‌పై ప్రశంసలు కురిపించింది. నివేదిక ప్రకారం, 'భారతదేశం పెరుగుతోంది. ఇప్పుడు ఆసియాలో మూడవ అత్యంత శక్తివంతమైన దేశంగా జపాన్‌ను అధిగమించింది. అయితే దాని వనరులతో పోల్చితే దాని ప్రభావం తక్కువగానే ఉందని తెలిపిది. ఆసియాలో భారత్ సత్తా పెరుగుతోందని నివేదిక పేర్కొంది. శక్తి పరంగా భారత్ మూడో స్థానం సాధించడం ఇదే తొలిసారి. ఏది ఏమైనప్పటికీ, అభివృద్ధి చెందుతున్న భారతదేశం నుండి ఆశించిన దానికి, వాస్తవానికి జరుగుతున్న వాటికి మధ్య భారీ అంతరం ఉంది. అయితే, భారతదేశానికి అపారమైన వనరులు, గొప్ప శక్తిగా అభివృద్ధి చెందడానికి అపారమైన సామర్థ్యం ఉంది. ఇక భారతదేశం సైనిక బలంలో నాల్గవ స్థానంలో, సాంస్కృతిక ప్రభావంలో నాల్గవ స్థానంలో, ఆర్థిక సామర్థ్యంలో నాల్గవ స్థానంలో, భవిష్యత్ వనరులలో మూడవ స్థానంలో, దౌత్య ప్రభావంలో నాల్గవ స్థానంలో ఉందని నివేదిక తెలిపింది. భారత్ మొత్తం ర్యాంకింగ్ ఇప్పుడు ఆసియాలో మూడో స్థానానికి చేరుకుంది.

## ముడా కుంభకోణంపైలో...

చట్టం 1988లోని సెక్షన్ 17ఏ కింద తనపై దర్యాప్తునకు గవర్నర్ ఆగస్టు 16న అనుమతి ఇవ్వడంలోని చట్టబద్ధతను సవాలు చేస్తూ సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. సిద్ధరామయ్య భార్య పార్వతికి ముడా అక్రమంగా 14 ప్లాట్లు కేటాయించిందనే ఆరోపణల నేపథ్యంలో ముడా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రిపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ప్రత్యేక కోర్టు చర్యలను నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు ఎత్తివేయడంతో దర్యాప్తు ముందుకు సాగేందుకు మార్గం సుగమమైంది. ప్రత్యేక న్యాయస్థానం లోకాయుక్త విచారణను ప్రకటించిన తర్వాత కూడా సిద్ధరామయ్యపై ముడా కుంభకోణానికి సంబంధించి కేసు వేసిన కార్యకర్త స్నేహమయి కృష్ణ సీబీఐ విచారణ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. "కోర్టు లోకాయుక్త దర్యాప్తును ఆదేశించింది. కానీ, మేము సీబీఐ విచారణ కోరుకుంటున్నందున మేము కర్ణాటక హైకోర్టును ఆశ్రయిస్తాము"' అని స్నేహమయి తెలిపారు. ఒక ప్రాజెక్టు కోసం భూమి కోల్పోవడంతో అందుకు పరిహారంగా మైసూరులోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో సిద్ధరామయ్య భార్య పార్వతికి 14 స్థలాలను ముడా కేటాయించిందన్న ఆరోపణలతో కర్నాటక లో ముడా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ స్కామ్ విలువ 3,000 కోట్లని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా, దళిత వర్గానికి చెందిన భూమిని సిద్ధరామయ్య ఆక్రమించుకున్నారని ఆరోపించాయి. సిద్ధరామయ్య బావమరి మలికార్జున స్వామి దేవరాజ్ పై కూడా ఆరోపణలు వచ్చాయి. ప్రతిస్పందనగా, సిద్ధరామయ్య అన్ని ఆరోపణలను ఖండించారు. అన్ని చర్యలు చట్టబద్ధమైనవని పేర్కొన్నారు. ముడా భూ కుంభకోణంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే లక్ష్యంతో బీజేపీ, జేడీ(ఎస్)లు గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నాయని సిద్ధరామయ్య ఆరోపించారు. భారతీయ జనతా పార్టీని "ప్రతీకార రాజకీయాలు" అని అభివర్ణించారు. తనకు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉందన్నారు. లోకాయుక్త దర్యాప్తునకు సంబంధించి న్యాయ నిపుణులను సంప్రదిస్తానన్నారు.

# రాష్ట్రంలో 35వేల ఉద్యోగాలు



▸▸ "సాంకేతిక నైపుణ్యం అందించడానికి హైదరాబాద్ ఒక గమ్యస్థానంగా మారాలి. తెలంగాణను దేశంలోనే ఒక రోల్ మాడల్‌గా తీర్చిదిద్దుతాం. ప్రపంచ వేదిక పై హైదరాబాద్‌ను ఒక విశ్వనగరంగా నిలబెట్టాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

✍ జయభేరి, హైదరాబాద్ :

గత పదేళ్లలో తెలంగాణలో నిరుద్యోగం పెరిగింది. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించలేదు. ఆ సమస్య తీవ్రంగా ఉందని ప్రజా ప్రభుత్వం గుర్తించినందునే యవత ప్రాధాన్యతగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ బీఎఫ్ఎస్ఐ రంగాల్లో నైపుణ్య శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ యువతకు మార్గనిర్దేశనం చేశారు.

జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ జెఎన్ఏఎఫ్ యూ క్యాంపస్ లో జరిగిన కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పలువురు ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువకులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. కొందరు ఇంజనీరింగ్ స్టూడెంట్స్ సైతం డ్రగ్స్ సరఫరా చేస్తుండటం బాధాకరం. ఇది తెలంగాణకు ప్రమాదం. కఠినంగా అణిచివేయాల్సిన అవసరం ఉంది. వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకే వారిలో విశ్వాసం పెంపొందించడానికి ఐటీఐలను టాటా టెక్నాలజీస్‌తో కలిసి ఏటీసీలుగా తీర్చిదిద్దడం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నాం. ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నలక్షలాది విద్యార్థులకు బేసిక్ నాలెడ్జ్ కూడా ఉండకపోవడానికి ప్రధానంగా టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్‌లో సరైన నిపుణులు లేకపోవడమే. యాజమాన్యాలు రాబోయే రోజుల్లో కూడా ఇలాగే కొనసాగిస్తే ఆ కాలేజీల అనుమతులను రద్దు చేయడం ఖాయం. ఐఎస్బీ, ఐఐటీ, నల్సార్, ట్రిబుల్ ఐటీ, జేఎన్టీయూ, ఉస్మానియా యూనివర్సిటీ లాంటి నాణ్యమైన విద్యా సంస్థలు ఉన్నందునే బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ వస్తున్నాయి. సాంకేతిక నైపుణ్యానికి హైదరాబాద్ ఒక హబ్‌గా మారాలి. ప్రపంచాన్ని శాసించే స్థాయిలో ఎదిగిన అజయ్ బంగా, సత్యనాదెళ్ల, శంతను నారాయణ లాంటి పెద్ద కంపెనీలకు సీఈవోలు హైదరాబాద్‌లో చదువుకున్న వారేనని గుర్తుచేస్తూ అలాంటి ప్రముఖులను వచ్చే డిసెంబర్‌లో నగరానికి ఆహ్వానిస్తాం. ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా లాంటి చిన్న దేశం 32 పతకాలను సాధిస్తే, 140 కోట్ల జనాభా కలిగిన మన దేశానికి ఒక్క బంగారు పతకం కూడా సాధించలేకపోయింది. ఈ పరిణామం మనందరికి కనువిప్పు లాంటిది. అందుకే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు. ఒలింపిక్స్, నేషనల్ గేమ్స్ పాల్గొనదలిచే వారికి శిక్షణ పొందడానికి అన్ని వసతులతో వచ్చే సంవత్సరంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ కూడా ప్రారంభిస్తాం. ఈ ప్రభుత్వం యువతను దృష్టిలో పెట్టుకుని అనేక నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రభుత్వాలు ఫోకస్ పెట్టాల్సిన అంశాలు ప్రధానంగా యువతకు ఒక దిశను చూపెట్టాల్సిన అవసరం ఉంది. తెలంగాణ యువతను తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం అలుపెరుగని రీతిలో పనిచేస్తుంది. రానున్న రోజుల్లో తెలంగాణ ఒక రోల్ మాడల్ గా తీర్చిదిద్దుతాం.

# నేతలు మారుతున్న ఈ ఊరు రోడ్డు మారడం లేదు

▸▸ సాక్షాత్తు నల్లగొండ జిల్లా మంత్రి రోడ్ల భవనాల శాఖ మంత్రిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట ఇచ్చిన రోడ్డు పరిస్థితి మారడం లేదు!?

▸▸ అంటే మంత్రి మాటకు లెక్క లేదా!?

▸▸ ఇచ్చిన మాట మరచిపోయాడా!?

▸▸ రాజకీయ నాయకుల మాటలకు విలువ లేదన్నమాట!?

▸▸ తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఊరు బాగుపడింది గాని ఈ ఊరు బాగుపడతలేదని ప్రజల ఆవేదన!?

✍ జయభేరి, తుంగతుర్తి :



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు గెలవగానే తన ఊరికి రోడ్డు వేయించుకున్నాడు. కానీ ఇప్పుడు రోడ్ల భవనాల శాఖ మంత్రిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఇటుకులపాడు గ్రామంలో శివుని టెంపుల్ ప్రారంభోత్సవం చేసి శివుని సాక్షిగా చెప్పిన మాట ఏమైపోయింది!? అధికారం రాగానే మరిచిపోయారా!? తర్వాత చూద్దాంలే చేద్దాంలే అనే ఆలోచన!? ఏదేమైనా తరాలు మారుతున్న నాయకులు మారుతున్న ప్రభుత్వాలు మారుతున్న రహదారి బ్రతుకు చిత్రం మారటం లేదు.. ఇటుకలపాడు గ్రామంలో అందరూ నేతలే... నెరిసిన జుట్టు రాజకీయ అనుభవం అపారమైంది.

అందుకే ఈ రోడ్డుకు ఈ దాపురీకం ఇలా శనిల వెంటపడుతుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే మందులు సామేలు రోడ్డుకు సరైన సమయం కేటాయించి రహదారి సరి చేయకుంటే రాబోయే రోజుల్లో చావు తప్పి కన్నులు లొట్ట పోయినట్టు ఆరోపణలు శాపనార్థాలు ఎన్నోమూట పెట్టుకోవడం తప్పదు... మనోడని మంచం ఎక్కిస్తే ఉచ్చ పోసినట్టు అయిపోయినంత పని అయిందని ఇటుకలపాడు ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు...

# మీడియా ముసుగులో సంచరిస్తున్న ఫేక్ గాళ్ళు..? తస్మా జాగ్రత్త

▸▸ కేంద్ర రాష్ట ప్రభుత్వాల నుంచి ఎటువంటి గుర్తింపు లేని యూట్యూబ్ నకిలీ గాళ్ళు

✍ జయభేరి, గుంటూరు :




ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి గుర్తింపు లేని యూట్యూబ్ చానల్స్ కు చెందిన 255 నకిలీ గాళ్లు వీరిపై చర్యలు తీసుకోవాలి. కొన్ని మీడియా సంస్థల కి ఎటువంటి గుర్తింపు లేనప్పటికీ ఐడి కార్డ్స్ మంజూరు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఫేక్ గాళ్ళు.. ఓ సిమ్ కార్డ్ తీసుకొని దీని ఆధారంగా ఓ మెయిల్ ఐడి క్రియేట్ చేసుకుని ఇదే మెయిల్ తో ఒక యూట్యూబ్ ఐడి క్రియేట్ చేసుకుని, మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో అంటూ వారికి వారే హోదాలు సృష్టించుకొని పైకి బిల్డప్ ఇస్తూ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ గాళ్ళు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని అనుమతులు పొంది ఆర్థిక ఇబ్బందులు వలన కేవలం సోషల్ మీడియాకె పరిమితమై ప్రజా సమస్యలపై నిత్యం ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యం పరుస్తూ జర్నలిస్టు వృత్తినే దైవంగా భావించే నిజమైన జర్నలిస్టులు మనుగడ కోల్పోతున్నారు.. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ జర్నలిస్ట్ అనే పదానికే మచ్చ తెస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రాష్ట్ర సమాచార శాఖ అధికారులు స్పందించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎటువంటి అనుమతులు లేకుండా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ అంటూ హోదాలు సృష్టించుకుని కార్యాలయాలు ప్రారంభించి ప్రారంభోత్సవాలు వార్షికోత్సవాలు క్యాలెండర్ యాడ్స్ అంటూ వివిధ కారణాలతో వసుళ్ళకు పాల్పడుతున్న నకిలీగాళ్లపై చర్యలు తీసుకోవాలని నిజమైన జర్నలిస్టుల మనుగడను కాపాడాలని సమాచార శాఖ అధికారులకు పలువురు సీనియర్ జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## బీసీ కులగణన ప్రక్రియ వీలైనంత తొందరగా...

✍ జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో బీసీ కులగణన ప్రక్రియను వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బీసీ కమిషన్‌ను కోరారు. బీసీ కులగణన ప్రక్రియ వీలైనంత తొందరగా పూర్తయ్యేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి సచివాలయంలో ముఖ్యమంత్రి తో కలిసి బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కుల గణన ప్రక్రియ విషయంలో సమగ్రంగా అధ్యయనం చేయాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని సీఎం కమిషన్‌కు సూచించారు.

## దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు

▸▸ మాజీ మంత్రి కొడాలి నాని




✍ జయభేరి, తిరుమల :

తిరుమల ప్రతిష్ట మంట గలిసేలా ఆలయాన్ని రాజకీయాల్లోకి ముఖ్యమంత్రి చంద్రబాబు లాగారని మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యానించారు. చంద్రబాబును దేవుడు క్షమించడన్నారు. చంద్రబాబు హయాంలో కూడా నాణ్యత లేని నెయ్యి ట్యాంకర్లు వెనక్కి వెళ్ళాయని.. మా హయాంలో కూడా నాణ్యత లేని నెయ్యి ట్యాంకర్లు వెనక్కి వెళ్ళాయని తెలిపారు. సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో తాజాగా నెయ్యి ట్యాంకర్లు వెనక్కి వెళ్ళాయని.. ఈ నెయ్యిని కూడా వాడలేదన్నారు. గతంలో కొన్ని వందలసార్లు ఇలానే నెయ్యిని వెనక్కి పంపటం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో నెయ్యి క్వాలిటీ లేదని 18 సార్లు ట్యాంకర్ల వెనక్కి పంపడం జరిగిందన్నారు. రాజకీయాల కోసం చంద్రబాబు ఇదంతా చేస్తున్నారన్నారు. జగన్‌ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో చంద్రబాబు తిరుమలను రాజకీయాల్లోకి తీసుకువచ్చారన్నారు. చంద్రబాబుకి బుద్ధి రావాలని, ప్రసాదంలో ఏ తప్పు జరుగలేదని భక్తులకు తెలియాలన్నారు. ఇప్పటి వరకు అలాంటివి జరగలేదన్నారు. దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసేందుకు దిగజారారని విమర్శలు గుప్పించారు. రాజకీయాల కోసం స్వామిని చంద్రబాబు రోడ్డుకు ఈడ్చారని వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఎన్నిసార్లు గుండు చేయించుకున్నారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. వేంకటేశ్వర స్వామిని మతాలతో చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్‌ను ఎదుర్కోవాలంటే చంద్రబాబు డైరెక్ట్‌గా రావాలన్నారు. చంద్రబాబు, లోకేష్ సిట్ అంటే సిట్ అనే పోలీస్ ఆఫీసర్‌తో సిట్ ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. మతాలను, కులాలను విచ్ఛిన్నం చేసే పెద్ద కుట్రగా తాము భావిస్తున్నామని.. దీనిపై ఎలాంటి ఎంక్వైరీకైనా సిద్ధంగా ఉన్నామని జగన్ ప్రధానికి, సుప్రీంకు లేఖలు రాశారన్నారు.

# ఉద్యమ స్ఫూర్తి.. పోరాట యోధురాలు

# చాకలి ఐలమ్మ జయంతి

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన మహిళ ఆమె. భూస్వామ్య దోపిడీ వ్యవస్థపై సమరశంఖం పూరించిన ధీర వనిత. కడవెండి, భైరాన్ పల్లి, కూటిగల్లు, ధర్మపురం, విసునూరు, మొండ్రాయి, గుండాల, దేవరుప్పుల, నర్మెట, గొలనుకొండ, కామారెడ్డి గూడెంలలో సాగిన రైతాంగ పోరాటానికి వెన్నుదన్నుగా ఆ వీరవనిత నిలిచారు. చాకలి ఐలమ్మ పేరు పలకకుండా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర అసంపూర్తి. రజక కుటుంబంలో పుట్టి పెత్తందారుల గుండెల్లో తుపాకి గుండై పేలింది. రజాకార్లు, దేశ్ ముఖ్ ఆగడాలను చీల్చి చెండాడిన వీరనారి ఐలమ్మ. ఆమె ఇంటిపేరుతో కలిపి చిట్యాల ఐలమ్మ అయినా రజక అస్మిత కోసం కులం కలిపి ఆమెను చాకలి ఐలమ్మగా వ్యవహరిస్తున్నారు. చిట్యాల ఐలమ్మగా వ్యవహరిస్తే ఆమె ఖ్యాతి పాలకుర్తికే పరిమితం అయ్యేది. చాకలి ఐలమ్మగా వినుతికెక్కడం వల్లనే ఆమె విగ్రహాలు తెలుగు రాష్ట్రాల్లో ఉరూరా అసంఖ్యాకంగా దర్శనమిస్తున్నాయి. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగవ సంతానంగా ఐలమ్మ జన్మించింది. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం. కులవృత్తే వారికి జీవనాధారం. పాలకుర్తికి పక్కనే ఉన్న మల్లంపల్లి దొర కుటుంబానికి చెందిన ఉత్తంరాజు జయప్రదాదేవి వద్ద 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుంది.

అదే విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డికి కంటగింపు అయింది. అప్పుడే వెట్టిగొట్టాలు చేయవద్దని పిలుపునిచ్చి 1940, 44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ ముఖ్ లు, రజాకర్ల అరాచకాలపై ఎదురుతిరిగి ఎర్రజెండా పట్టి, ఆంధ్రమహాసభ (సంఘం)లో చేరింది ఐలమ్మ. కష్టజీవులను చేరదీసి భూస్వాముల కట్టుబాట్లను సవాల్ చేసింది. ఆడది ముందుబడి తన ఆధిపత్యాన్ని వెనుకబడేసిందని రామచంద్రారెడ్డి రగిలిపోయాడు. దీంతో ఐలమ్మపై దొర కక్ష పెంచుకున్నాడు. కౌలుకు తీసుకున్న భూమిలో కాపుకొచ్చిన పంటను కాజేయాలని పన్నాగం పన్నాడు. గూండాలను పురమాయించారు. తనకు వ్యవసాయమే ముఖ్యమని, దొర గడీలో వెట్టిచేయను పో అని గట్టిగా చెప్పింది.

**ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని మోస్తూ దొరలను గడీలనుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత, తెలంగాణ పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులు. భూమి కోసం, భుక్తి, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తెలంగాణలో గ్రామగ్రామాన సాగింది. రజాకార్ల అరాచకాలతో ఆగ్రహించిన ఎందరో త్యాగధనుల వీరోచిత పోరాటాలతో బానిస సంకెళ్లు తెంచుకున్నది. ఆంధ్రమహాసభ, గుతుపల సంఘం నడిపిన ఆ ఉద్యమంలో పోరాడిన వారిలో అగ్రగణ్య చాకలి ఐలమ్మ.**



ఈ భూమినాది... పండించిన పంటనాది... తీసుకెళ్లడానికి దొరెవ్వడు... నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలింది. సంఘం కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు.
భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పువచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని తగులబెట్టి, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి పట్వారీ ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు. ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏ విధంగా నష్టపెట్టగలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది. నీ దొరోడు ఏం చేస్తాడ్రా? అని మొక్కవోని ధైర్యంతో రోకలిబండ చేతబూని గూండాలను తరమికొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. ఐలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. చాకలి ఐలమ్మ తెగువ.. సామాజికంగా దిగువ ఉన్న జనానికి ప్రేరణ, స్ఫూర్తినిచ్చింది. పల్లెపల్లెన ఉద్యమం ఎగిసిపడి, దొరల ఆధిపత్యం నేలమట్టమైంది. నైజాం వ్యతిరేక పోరాటానికి ఊపిరిలూదిన ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న ఊపిరి వదిలింది.



ఆలేటి రమేశ్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
రజక విద్యార్థి సంఘం
9948798982

నేడు రాష్ట్రంలో దేశంలో ఎన్నో అకృత్యాలు, అసమానతలు ,అంతరాలు, వివక్షత కొనసాగుతున్నప్పటికీ ప్రజానీకం స్పందించకపోవడం, పట్టించుకోకపోవడం బాధాకరం. నాటి ఉద్యమంలో పాల్గొన్నవారిలో చాలామంది నిరక్షరాస్యులే కేవలం 4 శాతంగా ఉన్నటువంటి అక్షరాస్యత ఆనాడు కొనసాగితే నేడు 75 శాతం అక్షరాస్యత ఉన్నప్పటికీ సమకాలీన పరిస్థితుల పట్ల స్పందించక పోవడం దురదృష్టం. ఇకనైనా ప్రజానీకం ఉద్యమ శక్తులు, ప్రజాసంఘాలు, రాజకీయపక్షాలు కార్యాచరణ చేపట్టాలి. అదే చాకలి ఐలమ్మ అమరత్వానికి నిజమైన నివాళి.
చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, బందగీ, నల్లా నర్సింహులు, ఎర్రంరెడ్డి మోహన్ రెడ్డి వంటి మానవ శతజ్ఞులు వారు ఈ గడ్డ మీద పుట్టడం మన అదృష్టం. వారిని మనం విస్మరించే కృతజ్ఞుల నేల మీద పుట్టడం వారి దురదృష్టం.



## అంతర్రాష్ట్ర బదిలీలు త్వరగా చేపట్టాలి

జయభేరి, హైదరాబాద్ :

ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు త్వరగా చేపట్టేలా తెలంగాణ, ఆంధ్ర ప్రభుత్వాలను కోరాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ (ముజీబ్)కి ఉద్యోగులు విజ్ఞప్తి చేసారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, హైదరాబాద్ జిల్లా కార్యాలయములో వారు డాక్టర్ ముజీబ్ ని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాలు ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు అంగీకరించాయని, తెలంగాణ ఉద్యోగులు తెలంగాణకు వస్తారని, అలాగే ఆంధ్ర ప్రాంత ఉద్యోగులు వారి రాష్ట్రానికి వెళ్తారని, ఎవ్వరు కూడా ఆందోళన చెందకూడదని అన్నారు.

## వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నుండి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని టీచర్లు లేని స్కూల్స్ లో వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని అదనపు తరగతి గదులు నిర్మించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ EV నర్సింహ రెడ్డిని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతపత్రం సమర్పించారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల గల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నర్సింహా రెడ్డి ఎమ్మెల్యేకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## దీన్ దయాళ్ ఉపాధ్యాయ కు నివాళులు

జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 25 :

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బిజెపి కార్యాలయంలో బిజెపి సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ ఏకాత్మ మానవవాదం ప్రతిపాదించి సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికే ప్రభుత్వ పథకాల మొదటి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ భావనను రూపొందించి. ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి పటిష్ట పునాదులు వేసిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ, గజ్వేల్ పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు నాయిని సందీప్, మాద్గురి నర్సింహా, చెప్యాల వెంకట్రెడ్డి, బిజెపి నాయకులు వేణుగోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం

- వేద పాఠశాలలు ఏర్పాటు చేస్తాం..
- గత ప్రభుత్వంలో ఆలయాలను గుర్తించని వైనం
- గజ్వేల్ మార్కెట్ పాలకమండలి ప్రమాణ స్వీకారానికి హాజరవుతా..
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 25 :

గజ్వేల్, పుణ్యక్షేత్రాల్లో భక్తుల సౌకర్యాలు కల్పనకు పెద్దపీట వేస్తుండగా, తెలంగాణ తిరుపతి యాదగిరిగుట్ట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కొడకండ్ల శివారులో గజ్వేల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోని ఆలయాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట వద్ద భక్తులకు మెరుగైన వసతులు కల్పించే క్రమంలో 200 గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండగా, కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో రాయగిరి వద్ద 20 ఎకరాల విస్తీర్ణంలో, రూ 43 కోట్ల వ్యయంతో వేద పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
అలాగే కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తల శ్రమను గుర్తిస్తుండగా, వారికి నామినేటెడ్ పోస్టుల భర్తీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించి ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సన్మాన మహోత్సవానికి హాజరు కానున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సిద్ది పేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జిలు హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ బాధ్యులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, న్యాయవాది సాజిద్ బేగ్, నాయకులు మహేందర్ రెడ్డి, సురేష్, యాదగిరి, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంక్షరెడ్డిని ప్రశంసించిన సీఎం

- సీఎం కలిసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి.



జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 25:

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి ఆంక్షరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన స్పందనను ఆమె సీఎం దృష్టికి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల యువత నుండి మంచి స్పందన వచ్చిందని ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు పట్ల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధి వేంనరేందర్ రెడ్డి, మీడియా విభాగం ఇన్చార్జి అయోధ్య రెడ్డి, సిద్దిపేట డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్‌బుక్‌లోకి దేవరకొండ అమ్మాయి గూండా సంతోషి

- దేవరకొండ కి వన్నె తెచ్చిన మహిళ
- పలువురు ప్రముఖుల అభినందనలు




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ క్రొచ్చెట్స్ తయారీలో గూండా సంతోషి గిన్నిస్‌బుక్‌లో చోటు దక్కింది. విశాఖపట్నంకు చెందిన మహిళా మనోవికాస్ క్రాఫ్ట్స్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే క్రొచెట్స్ తయారీలో ఈ అవకాశం లభించింది. గూండా సంతోషి దేవరకొండ పట్టణానికి చెందిన వీరమల్ల కృష్ణయ్య కుమార్తె గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకూ మొత్తం 450 మంది చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్దులతో కలిపి అతి తక్కువ సమయంలో 58,112 క్రోచెట్ స్క్వేర్‌స్‌ను తయారు చేశారు విజయనగరం వెంకోజీపాలెం చందన మోహన్‌రావు ఫంక్షన్‌హాల్లో వీటిని ప్రదర్శించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ దంగారికర్ పరిశీలించి లార్జెస్ట్ డిస్ప్లే ఆఫ్ క్రోంచెట్ స్క్వేర్స్ గా గిన్నిస్ రికార్డును ధ్రువీకరించారు. ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డులో దేవరకొండ అమ్మాయి గూండా సంతోషి దక్కడం ఎంతో గౌరవప్రదమని దేవరకొండ కే వన్నె తెచ్చిన మహిళగా పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

## భజపా సభ్యత్వ నమోదులో వర్గల్ ముందడుగు

- వర్గల్ మండల బిజెపి అధ్యక్షులు టేకులపల్లి బాల్ రెడ్డి



జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 25 :

వర్గల్ మండలంలో బిజెపి సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మండల శాఖ అధ్యక్షులు టేకులపల్లి బాల్రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మీనాజీపేట్, అనంతగిరిపల్లి, నాచారం, మజీద్ పల్లి గ్రామాల పరిధిలో సభ్యత్వ నమోదు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే గజ్వేల్ నియోజకవర్గాన్ని ముందు ఉంచాలనే లక్ష్యంతో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. యువత, మహిళలు, రైతులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగుల నుండి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ముఖ్యంగా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంపరి రమేష్, తిరుపతిరెడ్డి, కుమ్మరి రమేష్, రవీందర్, కాయిత రాజు, డ్యాగ శ్రీకాంత్ తో పాటు ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుకు 10 లక్షలు ఇచ్చి కోటి రూపాలకు అమ్ముకుంటారా..!

- గింత మోసం చేస్తారని మేం అస్సలు ఊహించలే.!
- మాకున్న భూములన్ని గుంజుకున్నారు మాకు తగిన న్యాయం చేయాలే..
- ప్రభుత్వం స్పందించి భూనిర్వాసితులకు న్యాయం చేయాలే...



జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 25 :

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులు బుధవారం 3 వ రోజు వంట వార్పుతో నిరసనలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతుకు ఎకరాకు 10 లక్షలు ఇచ్చి కోటి రూపాయలకు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవిన్యూ అధికారులు సమగ్ర సర్వేలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారాలు అందించాలన్నారు. అలాగే హెచ్ఎండిఏ అనుమతులతో కూడిన లేఔట్ ను ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలను ప్రతి ఒక్క లబ్ధిదారుకు అందించాలన్నారు. గతంలో ఇచ్చిన ఇండ్ల స్థలాలలో అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే పరిహారం కూడా రెట్టింపు చేసి రైతులకు అందించాలని వేడుకున్నారు. లేనిపక్షంలో కంపెనీల నిర్మాణాలను నిలిపివేస్తామని భీష్మించుకు కూర్చున్నారు. అవసరమైతే ప్రాణ త్యాగాలు కూడా చేస్తామని హెచ్చరించారు.

# ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రుల అరాచకాలను ఎండగడదాం

- మంత్రుల అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా పర్యటనలు
- ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశం.
- జిల్లా పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం.



**జయభేరి, నల్గొండ :**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మంత్రుల అరాచకాలను ఎండగడతామని కేటీఆర్ అన్నారు. అధికార అహంకారంతో ఈ జిల్లా మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. వారి అవినీతి ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ చేపట్టనున్న అంశాలు, కార్యక్రమాలను పార్టీ నేతలకు కేటీఆర్ వివరించారు. జిల్లాలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు

**మళ్లీ ఫ్లోరోసిస్ భూతం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్గొండ జిల్లాలో మళ్లీ ఫ్లోరోసిస్ భూతం తెరపైకి వస్తోందని కేటీఆర్ కు జిల్లా పార్టీ నేతలు వివరించారు. అదే విధంగా కాంగ్రెస్ నేతల అరాచకాలు అవినీతి కి అడ్డు అదుపు లేకుండా పోయిందని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏ విధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది నియోజకవర్గాల వారీగా కేటీఆర్ కు వివరించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్ని అంశాల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో వారిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని కేటీఆర్ కు చెప్పారు.

**స్థానిక సమస్యలపై పోరాడుదాం**

రాష్ట్ర రాజకీయాలతో పాటు నల్గొండ జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాల పైన కూడా మరింత చురుగ్గా ప్రజాక్షేత్రంలో వెళ్దామని స్థానిక జిల్లా నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో లేవనెత్తాల్సిన సమస్యలను వారికి వివరించారు. అదే విధంగా పార్టీని మరింత బలోపేతం చేయటంతో పాటు, కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను ఈ సమావేశంలో చర్చించారు. త్వరలోనే నల్గొండ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తో పాటు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్, ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్, గొంగిడి సునీతా రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, బూడిద బిక్షమయ్య గౌడ్, మాజీ జెడ్పీచైర్మన్లు బండా నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ భరత్ కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి మరియు పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశం

**జయభేరి, ఘట్కేసర్ :**

మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘట్కేసర్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ వారి 44వ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు శ్రీ సింగిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి, ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుంటుందూ రైతు పక్షపాతిగా వ్యవహరిస్తుందని అన్నారు.

## ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా గాజు సీసాలు




**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ ఐ కేర్ ఐ క్యారీ కార్యక్రమలో భాగంగా పాల్గొన్న చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. బుధవారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ ఐ కేర్ ఐ క్యారీ కార్యక్రమలో భాగంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ గా ఉండడానికి మన నుంచే మార్పు రావాలని మనం వాడే వస్తువులు ప్లాస్టిక్ రహితంగా ఉండాలని కోరరు. ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా గాజు సీసాలు, స్టీలు బాక్సులు వాడాలని.. మేము వాడుతున్నాం మీరు వాడండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పోచారం మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాలైన చౌదరిగుడా, వెంకటపురం, కొర్రముల లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. బుధవారం పోచారం మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాలైన చౌదరిగుడా, వెంకటపురం, కొర్రములలో పర్యటించి డంపింగ్ యార్డులు, జోడిమెట్ల చౌరస్తా వద్ద చేయవలసిన సుందరీకరణ పనులను పరిశీలించరు.పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు కమిషనర్ వీరారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఘట్కేసర్**

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ కార్యలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చమకూర మల్లరెడ్డి అదేనుసరం అందించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. పోచారం మున్సిపల్ కార్యలయంలో కే.మల్లీశ్వరి60 వేలు, N.రేఖ 27 వేలు, B. ప్రమీల 24 వేలు, P. ఎల్లయ్య 13500, చక్రపాణి 9వేలు, లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించరు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని.. దీనిని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ రెడ్డియ నాయక్, కౌన్సిలర్ గోంగళ్ల మహేష్, నయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, అకిటి బల్ రెడ్డి, మీసాల రాజేష్, పుట్ట ప్రవీణ్ తదిరులు పాల్గొన్నారు.

## అమరావతిలో MSME శిక్షణ కేంద్రం



**జయభేరి, అమరావతి :**

ఏపీ రాజధాని అమరావతిలో MSME 2వ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 20 ఎకరాలను కేటాయించింది. దీనిలో టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రాన్ని అందుబాటు లోకి తీసుకురానుంది. రూ.250 కోట్ల ఖర్చుతో దీన్ని ప్రతిపాదించగా, 20 ఎకరాల భూములను కేంద్ర MSME డెవలప్మెంట్ కమిషనర్ పేరిట ఉచితంగా బదిలీ చేయనుంది. విశాఖలో ఉన్న మొదటి టెక్నాలజీ సెంటర్లో డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, PG డిప్లొమా సహా పలు MSME కోర్సులు అందిస్తోంది.

## స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా లోనుపై అవగాహన సదస్సు

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సేవాసదనంలో గంగిడి దామోదర్ రెడ్డి అధ్యక్షులు అధ్యక్షతన స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా దేవరకొండ బ్రాంచ్ వారు లోనుపై అవగాహన సదస్సు నిర్వహించినారు సదస్సుకు బ్యాంక్ చీఫ్ మేనేజర్ పణింద్ర, ఫీల్డ్ ఆఫీసర్ పున్న చరణ్ బ్యాంక్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు (NVT) పాల్గొన్నారు. ఈ సందర్బంగా చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్స్ అందరికి 76 సంవత్సరాల వయస్సు వరకు 18 నెలల పెన్షనకు మొత్తము ఋణము అందజేస్తామని అన్నారు. 78 సం వయస్సు లోపు వడ్డీతో చెల్లించాలి. వడ్డీ 11.60 శాతము ఉంటుంది. నవంబరు లోపు లోను తీసుకున్న ప్రాసెస్ చార్జి ఉండదు అన్నారు మరియు 444 రోజులకు బ్యాంక్ నందు డబ్బులు నిలువజేసిన 7.60 శాతం చక్ర వడ్డి ఇవ్వబడును అన్నారు. ఫీల్డ్ అధికారి చరణ్ మాట్లాడుతూ ఈ అవకాశం నవంబర్ వరకు కలదు అన్నారు.కార్యదర్శి, కోశాధికారి అంకం చంద్రమౌళి, పంగునూరు లింగయ్య మాట్లాడుతూ అవసరం కలిగిన వారు ఈ అవకాశం వినియోగించుకోగలరు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి, ఆడిటర్ వనం బుచ్చయ్య, కార్యవర్గం సభ్యులు గుమ్మడివెల్లి కోటయ్య, మునిని వీరయ్య, మోటమర్రి పురుషోత్తం 30 మంది సభ్యులు పాల్గొన్నారు.



## రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టు అయింది

- సర్పంచ్ లు హాస్పిటల్లో ఉండి డబ్బులు లేక ఏడుస్తున్నారు.
- ఎన్ని అడ్డదారులు అయినా తొక్కి అధికారంలోకి వచ్చారు.
- సర్పంచ్ లకు బాకీ ఉన్న నిధులు అన్నీ వెంటనే విడుదల చేయాలి.

**జయభేరి, హైదరాబాద్ :**

ఉపాధిహామీ డబ్బులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వాటా ఇవ్వకపోవడం వల్ల అవికూడా విడుదల కావడం లేదు. గ్రామపంచాయితీలకు రావల్సిన రిజిస్ట్రేషన్ వాటా, మినరల్ డెవలప్మెంట్ ఫండ్ వాటా లాంటివి రాకుండా చేసారు. మరోపక్క కేంద్రం నుంచి వచ్చే నిధులు పక్కదోవ పట్టిస్తున్నారు. బాకీలు విడుదల చేయకపోతే మంత్రులను నిలదీయండి అని ఇదే రేవంత్ రెడ్డి అప్పుడు చెప్పారు. నువ్వు చెప్పిన మాటే నీకు అప్పజెప్పడానికి సర్పంచ్లు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్ లు చేసే ఆందోళనలకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. వారి ఆందోళనలో మేము క్రియాశీలకంగా పాల్గొంటాం. గ్రామ పంచాయితీలకు ఎన్నికలు సకాలంలో జరిగితేనే నిధులు వస్తాయి. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేక సమస్యలు పట్టించుకొనే నాథుడు లేక వల్లకాడుగా మారుతున్నాయి. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు అయ్యింది. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కలిపిఇస్తామని మాట ఇచ్చారు.. రిజర్వేషన్ అమలు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం.



## అజ్మాపురంలో మెగా ఉచిత వైద్య శిబిరం

**పీఏ పల్లి :**




పీఏ పల్లి మండలం అజ్మాపురం ఆరోగ్య గ్రామాల పరిరక్షణమే లయన్స్ క్లబ్ ముఖ్య ఉద్దేశమని దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. యశోద హాస్పిటల్ మలక్పేట హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు వస్కుల ముత్యాలు జ్ఞాపకార్థంతో మనవరాలు ధృతి మహిశ్రీ జన్మదినం సందర్భంగా వస్కుల రోహినమ్మ ఆర్థిక సహాయంతో పీఏ పల్లి మండలంలోని అజ్మాపురం గ్రామంలో యశోద ఆసుపత్రి వైద్య బృందంచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 350మంది ఉచితంగా గుండె కంటి ఆర్తో లాంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందజేశామని తెలిపారు పల్లెల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం కోసం లయన్స్ క్లబ్ ముందుకు వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఖరీదైన వైద్యం అందించి వారికి బాసటగా నిలవడమే ముఖ్య ఉద్దేశమని లయన్స్ క్లబ్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే అనేక మెగా ఉచిత వైద్య శిబిరాల నిర్వహించిందని భవిష్యత్తులో సైతం అనేక కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలు లైన్స్ క్లబ్ యొక్క సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి చిలుకూరి నిరంజన్, కిరాణా జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు నీల బుచ్చయ్య, కుంచకూరి లక్ష్మణ్, గుద్దేటి జంగయ్య, గాజుల రాజేష్, లకుమారపు మల్లయ్య , తిప్పర్తి,రుక్మారెడ్డి, వనం శ్రీనివాస్, మాజీ సర్పంచ్లు ఆదిరాల నగేష్, ఇరగదిండ్ల రామకృష్ణ, వస్కుల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని ప్రజాక్షేత్రంలో నిలబెడతాం

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి



**జయభేరి, ఘట్కేసర్ :**

మేడ్చల్ నియోజకవర్గ, ఘట్కేసర్ రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రశ్నిస్తే అధికార మందబలంతో గొంతు నొక్కే ప్రయత్నం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి. భారత దేశంలో అందులో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ ఆధారిత ప్రాంతం అయినందువల్ల ఇక్కడి ప్రజలు పెద్ద ఎత్తున వ్యవసాయం ద్వారానే తమ జీవనాన్ని సాగిస్తారు,జనాభాలో మెజారిటీగా ఉన్న ఈ రైతులను ఓటింగ్ యంత్రలుగా చూసే అవకాశవాద రాజకీయ నేతల స్వార్థం వల్ల వారి జీవితం రోజు రోజుకు కునారిల్లుతున్నాయి అని, గత ప్రభుత్వం రైతులను చేసిన మోసానికి ఆగ్రహంతో ఉన్న ఆ వర్గాన్ని ఓట్ల కొరకు రెండు లక్షల ఏకకాల రుణమాఫీ, గతం కన్నా ఎక్కువ మొత్తం రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆయా హామీలకు పంగానామం పెట్టి వారి కన్నీటికి కారణం అవుతుంది అని విమర్శించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, బుధవారం ఘట్కేసర్ మండల రైతు సహకార సంఘంలో అధికార పార్టీ నేతలను స్థానిక రైతులతో కలిసి రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధు కేవలం ఘట్కేసర్ ప్రాంతంలో మాత్రమే రుణమాఫీ జరగపోవడం ఇక్కడి నేతల అసమర్థతకు నిదర్శనం అని, అదే విధంగా పంట పెట్టుబడి సహాయం ఇవ్వాల్సిన సమయం దుక్కి దున్నే లేదా నాట్లు వేసే సమయం అయినప్పటికీ కాంగ్రెస్ మోసకారి బుద్ధితో వరి కోతల సమయంలో కూడా రైతుబంధు పూర్తిగా బంధు పెట్టినట్టుగా ఉన్న వ్యవహారాన్ని ఎండగట్టే ప్రయత్నం చేస్తుంటే అధికారుల అండతో ఇష్టారీతిన భయపెట్టే ప్రయత్నాలు చేయడం హేయనీయం అని ఆయన విమర్శించారు..... కాంగ్రెస్ పార్టీ మోస ప్రాయచిత్తం చేసుకునేలా రైతు రుణమాఫీ, రైతు బంధు ఎకరానికి 15,000 రూపాయలు వెంటనే విడుదల చేయాలని లేని యెడల బిజెపి పార్టీ పక్షాన కాంగ్రెస్ పార్టీని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని ఆయన హెచ్చరించారు....




# నా కల నెరవేరింది

'యానిమల్' సినిమాతో ఒక్కసారిగా యువతలో క్రేజ్ సంపాదించుకుంది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రీ. ప్రస్తుతం ఈ అమ్మడికి వరుసగా భారీ ఆఫర్లొస్తున్నాయి. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'బ్యాడ్ న్యూజ్' చిత్రం కూడా ఈ భామకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రం అక్టోబర్ 11న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు తనకు సినిమాల్లో డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని, ఈ సినిమాలో 'మేరే మెహబూబ్' అనే పాట ఆ లోటును తీర్చిందని ఆనందం వ్యక్తం చేసింది. 'నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అయితే ఇప్పటివరకు ఒక్క సినిమాలో కూడా డ్యాన్స్ చేసే అవకాశం దక్కలేదు. ఈ విషయం చాలా బాధపెట్టేది. 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రంలో నాపై పాట ఉందని తెలియగానే పట్టరాని సంతోషమేసింది. కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య ప్రోత్సాహంతో చాలా సులభంగా డ్యాన్స్ చేయగలిగాను. నేను తొలిసారి డ్యాన్స్ చేసిన ఈ పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని త్రిప్తి డిమ్రీ ఆనందం వ్యక్తం చేసింది.





# ధనుష్ ఇడ్లీ కడైలో అర్జున్ రెడ్డి హీరోయిన్ ..?

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న వన్ ఆఫ్ ది టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్లలో ఒకడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ ధనుష్ (Dhanush). రీసెంట్‌గా రాయన్‌తో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్న ధనుష్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో నటిస్తోన్న కుబేర షూటింగ్ దశలో ఉంది. ఇక ప్రస్తుతం DD4గా ఇడ్లీ కడై టైటిల్‌తో రాబోతున్న సినిమా కూడా చేస్తున్నాడు. కాగా ఈ చిత్రంలో అర్జున్ రెడ్డి హీరోయిన్ షాలినీ పాండే కీలక పాత్రలో నటిస్తున్నట్టు తాజా వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే నిజమైతే లాంగ్ గ్యాప్ తర్వాత ప్రేక్షకుల ముందుకు రాబోతున్న అర్జున్ రెడ్డి భామను ధనుష్ సిల్వర్ స్క్రీన్‌పై ఎలా ప్రజెంట్ చేయబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో నిత్యమీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అరుణ్ విజయ్, సత్యరాజ్, అశోక్ సెల్వన్, రాజ్‌కిరణ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ (డెబ్యూ) నిర్మిస్తోన్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. జీవీ ప్రకాశ్ కుమార్ ఇప్పటికే 2 పాటలను కంపోజ్ చేయగా.. ప్రస్తుతం పాటల చిత్రీకరణ కొనసాగుతున్నట్టు కోలీవుడ్ సర్కిల్ సమాచారం.



# చెన్నై మెయిన్ రోడ్డుకు గానగంధర్వుడు ఎస్పీబీ పేరు..

దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని తీసుకున్నది. తమిళనాడు రాజధాని చెన్నై నగరంలోని ఓ రోడ్డుకు ఎస్పీబీ పేరును పెట్టింది. బాల సుబ్రహ్మణ్యం నుంగంబాక్కం ఏరియాలో నివాసం ఉండేవారు. నుంగంబాక్కంలోని కాందార్ నగర్ మెయిన్ రోడ్డుకు స్టాలిన్ ప్రభుత్వం ఎస్పీబీ పేరు పెట్టింది. ఇకపై కాందార్‌నగర్ మెయిన్ రోడ్డును ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్‌గా పిలువనున్నారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.
ఎస్పీబీ తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, మారాఠీ తదితర భాషల్లో దాదాపు 40వేలకుపైగా గీతాలను ఆలప్పించారు. ఆయన పేరిట గిన్నిస్ రికార్డు సైతం ఉన్నది. సినీ సంగీతరంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్రం 2001లో పద్మశ్రీ, 2011లో పద్మభూషణ్, 2021లో పద్మవిభూషణ్ అవార్డులతో సత్కరించింది. బాలసుబ్రహ్మణం కరోనా బారినపడి కోలుకుంటూ 2020, సెప్టెంబర్ 25న తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆయన నాలుగో వర్ధంతి రోజున ఆయన గౌరవార్థం స్టాలిన్ ప్రభుత్వం ఓ రోడ్డుకు ఆయన పేరును పెట్టింది. ఈ సందర్భంగా ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంక్రాంతి హంగామా?

హ్యాట్రిక్ హిట్స్ తర్వాత బాలయ్య నుంచి సినిమా రాలేదు. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో ఆయన ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'వీరమాస్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. సితార ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణం దాదాపు తుదిదశకు చేరుకున్నది.
ఈ సినిమా విడుదల తేదీ విషయంలో ఇప్పటివరకూ క్లారిటీ లేదు. అయితే.. అందుతున్న తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారట. త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రానున్నది వినికిడి. బాలకృష్ణ 109వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.
సంక్రాంతి విజయాలు బాలయ్యకు కొత్తకాదు. ఈ సినిమా సంక్రాంతి రిలీజ్ ఖాయమైతే నందమూరి అభిమానుల్లో పండగే. ఊర్వశీ రౌతేలా, ఛాందినీ చౌందరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. థమన్ సంగీత దర్శకుడు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com